
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 1 జూన్ 2025




జీజీహెచ్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పోస్టుల భర్తీ

శ్రీకాకుళం రిమ్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.అమూల్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అనుమతితో డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్‌లో 11 పోస్టులు (డాక్టర్, ఇతర సిబ్బంది) భర్తీ చేయనున్నట్లు చెప్పారు. దరఖాస్తులను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని తెలిపారు. నియామకాలను పారదర్శకంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

వివరాలు నమోదు కావట్లే!

- 'సుఖీభవ' కోసం రైతుల తంటాలు
- వైసీపీ ప్రభుత్వంలో తప్పిదాలు శాపంగా మారిన వైనం
- జాయింట్ ఎల్‌పీఎంలతో సమస్య
- పెట్టుబడి సాయం రావడంపై అన్నదాతల్లో ఆందోళన



● మెళియాపుట్టి మండలం పెద్దమడి గ్రామానికి చెందిన పెద్దింటి సోమేశ్వరరావు అనే గిరిజన రైతుకు 3.24 ఎకరాల ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాను 15 ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం ఇచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో సోమేశ్వరరావుకు రైతుభరోసా డబ్బులు అందేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద ఏడాకి రూ.20 వేలు రైతుల ఖాతాలో జమచేస్తామని చెప్పడంతో సోమేశ్వరరావు తన భూమికి చెందిన 1బీ, పట్టాదారు పుస్తకంతో రైతుసేవా కేంద్రానికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని అధికారులను కోరాడు. దీంతో వారు వివరాలను నమోదు చేసేందుకు ఆన్‌లైన్‌లో ప్రయత్నించగా నో డేటా ఫౌండ్ అని వస్తుంది. దీంతో సోమేశ్వరరావు ఆందోళన చెందుతున్నాడు.

● మెళియాపుట్టి మండలం నందక కొత్తూరు గ్రామానికి చెందిన పడల పున్నయ్యకు 90 సెంట్ల భూమి ఉంది. రైతుసేవా కేంద్రానికి వెళ్లి తన భూమి వివరాలు ఇవ్వగా వీఏఏ లాగిన్‌లో ఎల్‌పీఎం నెంబర్‌తో పున్నయ్య భూమి కనిపించలేదు. దీంతో డేటా అప్‌లోడ్ కాకపోవడంతో అన్నదాత సుఖీభవ వస్తుందో? రాదోనని పున్నయ్య ఆందోళన చెందుతున్నాడు.

● టెక్కలి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన జి.పగడాలమ్మకు సుమారు 80సెంట్ల భూమి ఉంది. వన్‌బీ, పాస్‌బుక్ ఆమె పేరుతో ఉన్నాయి. అయినా వీఏఏ లాగిన్‌లో పగడాలమ్మ భూమి వివరాలు కనిపించడం లేదు. ఇలాంటి రైతులు జిల్లాలో అనేక మంది ఉన్నారు.

మెళియాపుట్టి, మే 31 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం భూసర్వే పేరుతో భూముల వివరాలన్నీ తారుమారు చేసింది. ఇప్పటికీ ఆ చిక్కుముళ్లు వీడకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రీసర్వే పేరుతో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినా ఎక్కడా ప్రయోజనం కనిపించడం లేదు. గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు తీసుకున్నారే తప్పా సమస్యలను పరిష్కరించలేదని రైతులు వాపోతున్నారు. దీనివల్ల అన్నదాత సుఖీభవ పథకానికి దూరమయ్యే పరిస్థితి కనిపిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 4,47,382 ఎకరాలను 5,88,191 మంది రైతులు సాగుచేయనున్నట్లు అధికారులు గుర్తించారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి గత నెల 24 నాటికి 3,97,126 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ జరిగాయి. మరో 46,488 మంది రైతుల వివరాలు తహసీల్దార్ లాగిన్‌కు పంపించారు. 29,041 మంది రైతుల దరఖాస్తులను తిరస్కరించారు. 1,15,536 రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. చాలామంది రైతుల భూ వివరాలు సీసీఎల్ డేటాలో కనిపించడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో చేసిన సర్వేలో ఒకే ఎల్‌పీఎం నెంబర్‌ను ఎక్కువ (మిగతా 6వ పేజీలో..)



అన్నదాత సుఖీభవ పథకానికి రైతుల వివరాలు సేకరిస్తున్న వీఏఏలు(ఫైల్)

గణనీయంగా పాల ఉత్పత్తి

- జిల్లాలో అవసరానికి మించి సరఫరా
- వినియోగంలో అధిక తేడా



శ్రీకాకుళం, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాల ఉత్పత్తి గణనీయంగా ఉంది. జిల్లా ప్రజల అవసరానికి మించి పాల ఉత్పత్తి జరుగుతోంది. కొన్ని కుటుంబాలు రోజుకి లీటరు చొప్పున, మరికొన్ని కుటుంబాలు చొప్పున వినియోగిస్తున్నాయి. జిల్లాలో పాడిఆవులు 2.18లక్షలు, పాడిగేదెలు 22వేలు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకి 11.66లక్షల లీటర్ల పాల ఉత్పత్తి అవుతోంది. జిల్లాలో 27.3లక్షల జనాభా ఉన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలు.. సూచనల ప్రకారం ప్రతి వ్యక్తికీ ఒకరోజుకి గరిష్ఠంగా 300 మిల్లీలీటర్ల పాలు అవసరం. అయితే, జిల్లాలో ఒక మనిషికి 431 మిల్లీ లీటర్ల పాలు లభ్యమవుతున్నాయి. అంటే అదనంగా 130 ఎం.ఎల్ పాలు అధికంగా లభిస్తోంది. ఈవిషయమై జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు రాజగోపాలరావు మాట్లాడుతూ.. 'జిల్లాలో ప్రజల అవసరాలకు మించి పాలు ఉత్పత్తి జరుగుతుంది. కల్తీ అనేది ఇంతవరకు జిల్లాలో ఉత్పన్నం కాలేదు. పాలు అందరూ వినియోగిస్తే మంచిది. ఉత్పత్తి ఇంకా పెరగాలి. పశుసంవర్ధక శాఖ నుంచి అన్ని విధాలా సహకారం ఉంటుంది.' అని తెలిపారు.

(పూర్తి వివరాలు 6లో)

అక్రమాల అనకొండ

- ఆందోళనలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది
- వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు
- ఇదీ జగతి మెట్ట జగనన్న ఇళ్ల కాలనీ తీరు

6లో





కంచమ్మ సంబరాలు

- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

6లో

ట్రావెలర్స్‌కు ఆశ చూపి గంజాయి రవాణా

- మడపాం వద్ద ఇద్దరి అరెస్టు : ఏఎస్పీ శ్రీనివాసరావు

8లో

సమన్వయంతోనే ఉత్తమ ఫలితాలు

- ప్రతీ జిల్లా అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలి
- గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్



మాట్లాడుతున్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 31(ఆంధ్రజ్యోతి): 'కాలం చాలా వేగంగా మారిపోతోంది. ప్రతీ జిల్లా అన్ని రంగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలి. అన్నివిభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాల సాధన సాధ్యమవుతుంది.' అని గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తలసరి ఆదాయం, జీడీపీ వంటి కీలక సూచీలలో శ్రీకాకుళం జిల్లా గణనీయంగా పురోగతి సాధిస్తోందని వెల్లడించారు. ముఖ్యమంత్రి కలెక్టర్లతో నిర్వహించిన కాన్ఫరెన్స్ తరువాత ప్రగతి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పింఛన్ల పంపిణీలో ఐవీఆర్ఎస్ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నామని, డోర్ టు డోర్ సేవలతో ఈ వ్యవస్థ మరింత సమర్థవంతంగా అమలవుతోందని తెలిపారు. జిల్లాలో ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాగావళి, వంశధార నదులపై కరకట్టలను పర్యవేక్షించాలని, నిరంతరం మానిటరింగ్ చేయాలని సూచించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. జిల్లాలో సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేస్తున్నామని, వ్యవసాయం, అనుబంధ రంగాలకు ప్రోత్సాహం అందిస్తున్నామని, విపత్తుల నిర్వహణలో ముందస్తు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో జిల్లాను అన్నిరంగాల్లో ముందంజలో నిలుపుతామని అన్నారు. సమీక్షలో భాగంగా యోగాంధ్ర-2025, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలతో పాటు విపత్తులపై తక్షణ స్పందన, పింఛన్ల పంపిణీ, వ్యర్థాల నిర్వహణ వంటి కీలక అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. 81 శాఖల ద్వారా డిజిటల్ మానిటరింగ్ జరుగుతోందని, విపత్తుల సమాచారాన్ని స్థానిక ప్రజలకు వేగంగా చేరవేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైవే నెత్తురోడుతోంది



రణస్థలం షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం (ఫైల్)

● గత నెల 10న రణస్థలం మండలం పైడిభీమవరం నుంచి లావేరు మండలం బెజ్జిపురం మధ్య జాతీయ రహదారిపై మూడు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. మరికొందరు క్షతగాత్రులయ్యారు.

● గత నెల 3న ఎచ్చెర్ల బైపాస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో టీడీపీ నాయకుడు అడపా శ్రీను మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై సింహాచలం అనే వ్యక్తితో కలిసి ఇంటికి వెళుతుండగా ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో శ్రీను ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సింహాచలం చికిత్సపొందుతూ మరుసటి రోజు ఆస్పత్రిలో కన్నుమూశాడు.

● మార్చి 15న లావేరు మండలం బుడుమూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. కారు టైరు పేలడంతో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో ముగ్గురు వ్యక్తులు ఘటనాస్థలంలోనే మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

రణస్థలం, మే 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-16 ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రతిరోజూ ఏదోఒక చోట ప్రమాదాలు సంభవించి ప్రజలు మృత్యువాత పడుతున్నారు. ప్రధానంగా రణస్థలం మండలం పైడిభీమవరం నుంచి ఎచ్చెర్ల మధ్య అధికంగా ప్రమాదాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జేఆర్‌పురం సర్కిల్ పరిధిలోనే ప్రమాద కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. జనవరి నుంచి ఇప్పటివరకూ రోడ్డు ప్రమాదాల్లో 20 మంది చనిపోయారు. జిల్లాలో సుదీర్ఘ జాతీయ రహదారి ఉంది. రణస్థలం మండలం పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకూ 197 కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. పైడిభీమవరం నుంచి నరసన్నపేట వరకూ ఆరులైన్ల రహదారి 57 కిలోమీటర్ల మేర ఉంది. నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ విస్తరించాల్సి ఉంది. రహదారి విస్తరణలో భాగంగా పైడిభీమవరం నుంచి నరసన్నపేట వరకూ 30 వంతెనలు నిర్మించారు. పరిమిత సంఖ్యలో యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. ఈ యూటర్నుల వద్ద గ్రామాల పేర్లను సూచించే బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు అయోమయానికి గురై ముందుకు వెళ్లిపోతున్నారు. కొంతదూరం వెళ్లిన తరువాత దారి తప్పిపోయామని గుర్తించి రాంగ్ రూట్‌లో వెనక్కి వస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాల బారినపడుతున్నారు.



బుడుమూరు వద్ద జరిగిన ప్రమాదంలో కారులో ఉన్న మృతదేహాలు (ఫైల్)

57 ప్రమాద స్పాట్లు..

ప్రమాదాలు నియంత్రించడానికి, ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకే జాతీయ రహదారిని విస్తరించారు. కానీ, రోడ్డు విస్తరణ తరువాత ప్రమాదాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వాహనాల అతివేగం, వేగ నియంత్రణ చర్యలు, పోలీసుల తనిఖీలు లేకపోవడం వల్లే ప్రమాదాలు పెరుగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో జాతీయ రహదారిపై 57 ప్రమాద స్పాట్లను గుర్తించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల్లోపు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్టు పోలీసులు సైతం గుర్తించారు. సర్వీసు రోడ్ల ప్రారంభం, ముగింపుల వద్ద భారీ బోర్డులు కనిపించేలా ఏర్పాట్లు చేయడం లేదు. చిన్నపాటి బోర్డులు ఏర్పాటు చేయడంతో వాహనదారులు గుర్తించడం లేదు. అందుకే జిల్లా వ్యాప్తంగా హైవేపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

వెలగని విద్యుత్ దీపాలు

జిల్లాలో హైవేకి సంబంధించి (మిగతా 8వ పేజీలో..)

పొగాకు వినియోగాన్ని అరికట్టాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో అనిత

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పొగాకు వినియోగాన్ని అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ఆమె డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు జరిగింది. ఏడురోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించి, పొగాకు నివారణ ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. పొగాకు వినియోగంతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఉదరకోశ, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి గ్రామాల్లో పొగాకు వినియోగాన్ని అరికట్టేందుకు అందరం కృషి చేయాలన్నారు. ఈ మేరకు 15 రోజుల కార్యాచరణను ప్రకటించారు. పొగాకు ఉత్పత్తుల చట్టం-2003ను కఠినంగా అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీకాంత్, వైద్యులు మేరీ క్యాథరీన్, ఇప్పిలి వెంకటరావు, డీఐవో రాందాస్, కార్యాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన పిడుగులు

- జిల్లాలో ఇద్దరి మృతి
- పొలాల్లోనే విగతజీవులైన వైనం





సింహాచలం మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, అప్పలనాయుడు (ఫైల్)

కొత్తూరు/సరుబుజ్జిలి, మే31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి చెందారు. కొత్తూరు మండలం ఆకులతంపర కాలనీకి చెందిన పెయ్యిల సింహాచలం(79) అనే వృద్ధుడు శనివారం సాయంత్రం మేకలను తోలుకుని గ్రామ సమీపంలోని పొలాల వైపు వెళ్లాడు. అయితే, ఒక్కసారిగా మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురవడంతో సమీపంలోని చెట్టు కిందకు వెళ్లి సింహాచలం నిల్చొన్నాడు. ఈ సమయంలో చెట్టుపై పిడుగు పడడంతో సింహాచలం అక్కడికక్కడే మృతి చెందాడు. మేకలను తోలుకెళ్లిన భర్త ఎప్పటికీ రాకపోవడంతో భార్య పున్నాలు తన బంధువులతో కలిసి పొలాలకు వెళ్లి చూడగా సింహాచలం విగతజీవిగా పడిఉన్నాడు. దీంతో బోరున విలపించింది. సింహాచలానికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు వలస కూలీలుగా ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. సింహాచలం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. దీనిపై స్థానికులు కొత్తూరు పోలీసులు, తహసీల్దార్‌కు సమాచారాన్ని అందజేశారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు.

బుడ్డివలసలో..

సరుబుజ్జిలి మండలం బుడ్డివలసకు చెందిన బూరాడ అప్పలనాయుడు (55) అనే వ్యక్తి (మిగతా 7వ పేజీలో..)

మృత్యు తీగలు

- తరచూ విద్యుత్ ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- పట్టించుకోని ఆ శాఖ అధికారులు
- అస్తవ్యస్తంగా వ్యవస్థ
- వేధిస్తోన్న సిబ్బంది కొరత



ఈశ్వరరావు, కృష్ణ మృతదేహాలు (ఫైల్)

● ఈ నెల 26న కంచిలి మండలం తలతంపర పంచాయతీ సామంతపుట్టుగలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఈశ్వరరావు అనే యువకుడితో పాటు కృష్ణ, నందిని అనే ఇద్దరు చిన్నారులు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామ దేవత ఉత్సవాలకు ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలే వారి పాలిట శాపంగా మారాయి. అలంకరణ కోసం ఏర్పాటు చేసిన విద్యు ద్దీపాలను తాకడంతో షాక్‌కు గురై వారు మృతి చెందారు. ఈ విషయంలో విద్యుత్ శాఖ ఉదాసీనంగా వ్యవహరించిందన్న విమర్శలు ఉన్నాయి.

ఇచ్ఛాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో వెలుగులు నింపే విద్యుత్ తీగలే రైతులు, ప్రజల పాలిట యమపాశాలుగా మారి వారి కుటుంబాలను చీకట్లోకి నెట్టేస్తున్నాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా, అమాయకులు బలిఅవుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. విద్యుత్ (మిగతా 7వ పేజీలో..)



పొలం కన్నా.. పశుపోషణే మిన్న!

- పాడి రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి
- పిల్లల చదువులు, వివాహాలకూ ఇదే డబ్బు
- కొందరు పాడి రైతుల విజయగాథలు

మెళియాపుట్టి, మే 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాల్లో పాడి ఒక భాగం. ఒకప్పుడు గ్రామాల్లో ప్రతి ఇంట్లోనూ పాలిచ్చే పశువులు ఉండేవి. పాలు ఇంట్లో వాడకానికి పోను మిగిలినవి ఇరుగుపొరుగు వారికి ఇచ్చేవారు. కొంతమంది గ్రామాల్లోకి వచ్చే వ్యాపారులకు అమ్మేవారు. తద్వారా కుటుంబ పోషణకు, ఇతర చిన్న అవసరాలకు సరిపడా ఆదాయం పొందేవారు. ఇప్పుడు పాడి పెంపకం ఆసక్తి తగ్గిపోతోంది. గ్రామాల్లో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ ప్రభావం రైతుల జీవితాలపై పడింది. పంటల్లో నష్టం వచ్చినప్పుడు రైతులు అప్పులపాలు కావాల్సి వస్తోంది. అయితే కొందరు రైతులు ఇప్పటికీ పాడితో ఉపాధి పొందుతున్నారు. పిల్లలను చదివించుకుంటూ వారికి వివాహాలు కూడా చేస్తున్నారు. పాడిపెంపకం ద్వారా ఉపాధి పొందుతున్న కొందరు రైతుల గురించి కథనాలు..

● మెళియాపుట్టి మండలం గొడ్డ గ్రామానికి చెందిన ఎన్ని పాల్గుణరావు నిరుపేద రైతు. 15 ఏళ్ల క్రితం ఉన్నఊరిలో ఉపాధిలేదు. కుటుంబ పోషణ కష్టమైంది. వలస వెళ్లడానికి సిద్ధపడ్డాడు. కొద్దిరోజులు చూద్దామని రూ.40 వేలతో ఒక ఆవును కొన్నాడు. ఇప్పుడు వాటి సంఖ్య 15కి చేరింది. అప్పులన్నీ తీరిపోయాయి. కుటుంబం కూడా ఆర్థికంగా నిలదొక్కుకుంది. రోజూ 90 లీటర్ల వరకు పాలు అమ్ముతున్నానని, దీనిద్వారా రూ.2700 వరకు ఆదాయం వస్తోందని ఆ రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.


పాడి ఆవులతో ఎన్ని పాల్గుణరావు

నేడు ప్రపంచ పాల దినోత్సవం

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన పాడిపశువుల పెంపకం నేడు పట్టణాలకూ విస్తరించింది. పట్టణాల్లో డెయిరీలు పెట్టుకుని అధికంగా పాలు ఇచ్చే ఆవులు, గేదెలు పెంచుతూ చాలామంది ఉపాధి పొందుతున్నారు. వ్యయభారం కారణంగా కొందరు పశుపోషణకు దూరంగా కాగా.. ప్రస్తుతం పాలకు మంచి డిమాండ్ ఉండడంతో మళ్లీ ఈరంగం వైపు మళ్లుతున్నారు. అప్పులు తీర్చుకుంటూ.. కుటుంబాలను పోషించుకుంటూ.. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. దేశంలో ప్రతిఏటా జూన్ 1న ప్రపంచ పాల దినోత్సవంగా జరుపుకుంటాము. పాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, ఉత్పత్తిని పెంచడంపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ దినం ముఖ్య ఉద్దేశం. ఐసీఎంఆర్ సూచనల మేరకు ఒక వ్యక్తికి సరైన పోషకాలు అందాలంటే రోజుకు 250 మి.లీ. పాలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

పాడిపోషణతోనే లాభం

ఇప్పుడున్న పరిస్థితుల్లో వ్యవసాయం కన్నా పశుపోషణ లాభదాయకంగా ఉంది. రెండు ఎకరాల పొలం సాగు చేస్తున్నా అప్పు మిగులుతోంది. అదే రెండు ఆవులు పెంచుకోవడం వల్ల మంచి ఆదాయం వస్తోంది. పొలం చేసుకుంటూనే ఆవుపాల ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా పోయాయి. నా కుమారులు కూడా పాడిపరిశ్రమ వైపే మొగ్గు చూపుతున్నారు.



- నందో, బందపల్లి

భార్య సాయంతో..

ఎచ్చెర్ల, మే 31(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం ధర్మవరం పంచాయతీ రామజోగిపేటకు చెందిన మూకళ్ల అచ్చిబాబు పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. ఆ తర్వాత వెల్డింగ్ షాపును నడిపాడు. ఆ షాపుతో పూర్తిస్థాయి ఉపాధి లభించలేదు. దీంతో పాడి పశువుల పెంపకంపై దృష్టిసారించాడు. 7 ఆవులను పెంచుతూ రోజుకు 60- 70 లీటర్ల పాలను సేకరిస్తున్నాడు. ఒక్కో లీటరు 36 నుంచి 40 రూపాయల ధరకు పాలసేకరణ కేంద్రానికి ఇస్తున్నాడు. తన భార్య భారతి సాయంతో అచ్చిబాబు పాడిపశువుల పెంపకం చేపడుతున్నాడు.


పాడిపశువులతో మూకళ్ల భారతి

పాల అమ్మకంతో జీవనోపాధి

సరుబుజ్జిలి, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన కాగితాపల్లి వెంకటరమణ పాడిపోషణలో రాణిస్తున్నాడు. ఆయనకు కేవలం 30 సెంట్లు భూమి మాత్రమే ఉంది. జీవనోపాధి కష్టతరంగా మారిన సమయంలో ఆవులను కొనుగోలు చేసి పాలను సేకరించి అమ్ముతున్నాడు. వచ్చిన ఆదాయంతో ముగ్గురు కుమార్తెలు, భార్యను పోషించుకుంటున్నాడు. తనకున్న స్థలంలో షెడ్డు ఏర్పాటు చేసి గోవులను పెంచుతున్నాడు. ఇతర పాడి రైతుల నుంచి కూడా పాలను కొనుగోలు చేసి గుర్తింపు పొందిన పాల సేకరణ కేంద్రానికి విక్రయిస్తున్నాని, తద్వారా తన ఆర్థిక లావాదేవీలు పెరిగాయని వెంకటరమణ చెబుతున్నాడు.

● చిగురువలస గ్రామానికి చెందిన పల్లి వరలక్ష్మి, ఆమె భర్త వీరన్న సుమారు 30 ఏళ్లుగా పాడి గేదెలను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఈ వచ్చిన ఆదాయంతో తన ఇద్దరు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించి, వారికి వివాహాలు కూడా చేశారు. మూడు దశాబ్దాల కిందట లీటరు పాల ధర రెండు రూపాయలు ఉండేదని, ప్రస్తుతం రూ.50 నుంచి రూ.60కు విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రతిరోజూ సుమారు 20 నుంచి 30 లీటర్ల పాలు సరుబుజ్జిలి జంక్షన్‌లోని టీ దుకాణాలకు విక్రయిస్తున్నట్లు తెలుపుతున్నారు.


పాడిగేదెలతో వరలక్ష్మి



ఆ గ్రామంలో 300 కుటుంబాలు

పొలాకి, మే 31(ఆంధ్రజ్యోతి): పొలాకి మండలం కుసుమ పోలవలస గ్రామం అది. ఈ గ్రామస్థులకు పాడిపశువులే ఆదాయ వనరు. 300 కుటుంబాలు రోజుకు 1400 లీటర్లను విశాఖ, హెరిటేజ్‌కు విక్రయిస్తున్నారు. కొందరు సమీపంలోని నరసన్నపేటకు వెళ్లి హోటల్‌కు ఇస్తున్నారు. 'ప్రతిరోజూ 60 లీటర్ల పాలు విక్రయిస్తున్నాను. దీనివల్ల ఇంటిల్లిపాది ఖర్చులకు ఇబ్బంది ఉండడం లేదు. పిల్లల చదువులకూ ఇదే డబ్బు' అని గ్రామానికి చెందిన అలిగి లక్ష్మి తెలిపారు.

పాల డబ్బుతో కూతురు వివాహం చేశా

రోజుకు 70 లీటర్ల పాలను డెయిరీ, హోటళ్లకు విక్రయిస్తాను. గత కొన్నేళ్లుగా పాడిపశువుల పైనే మా కుటుంబం ఆధారపడింది. ఈ డబ్బులతోనే నా కూతురిని చదివించాను. వివాహం కూడా చేశారు. డెయిరీ యాజమాన్యం వారు పండుగ సమయంలో ప్రోత్సాహకాలు, రుణాలు అందచేస్తున్నారు.



- నేతింటి శ్రీరాములు, పాతూరు

ఏడేళ్లుగా పాడిపోషణ..

నరసన్నపేట, మే 31(ఆంధ్రజ్యోతి): జమ్ము గ్రామానికి చెందిన వెలమల కృష్ణారావు వెన్నెముక సమస్యతో బాధపడుతున్నాడు. అయినా ఏడేళ్లుగా పాడిపోషణతో కుటుంబాన్ని నెట్టుకొస్తూ...ఆర్థిక స్వాలంబన సాధిస్తున్నాడు. రోజుకు 30 లీటర్ల నుంచి 40 లీటర్ల వరకు పాల ఉత్పత్తి చేస్తూ రోజుకు రూ.వెయ్యి వరకు ఆదాయం పొందుతున్నాడు. పాడిపశువుల పెంపకంతో మంచి ఫలితాలను సాధించవచ్చునని కృష్ణారావు చెబుతున్నాడు.



పాల వ్యాపారమే ఆదుకుంది

కంచిలి, మే 31(ఆంధ్రజ్యోతి): పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన పాడి రైతు లమ్మత అన్నయ్యకు రెండు ఎకరాల కొబ్బరి తోట ఉంది. పదేళ్లుగా కొబ్బరి దిగుబడులు లేక అప్పుల పాలయ్యాడు.భార్య చనిపోవడంతో ఇద్దరు కుమారులను పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. దీంతో పాడిపెంపకంపై దృష్టి పెట్టాడు. ప్రస్తుతం ఆయన వద్ద ఐదు ఆవులు ఉన్నాయి. ప్రతిరోజు ఉదయం 13లీటర్లు, సాయంత్రం 13 లీటర్లు చొప్పున్న పాలు సేకరించి, పాలసేకరణ కేంద్రానికి విక్రయిస్తున్నాడు. పాల వ్యాపారమే తమను ఆదుకుంటుందని చెబుతున్నాడు.

వివరాలు నమోదు కావట్లే!

(5వ పేజీ తరువాయి)

మందికి కేటాయించారు. అలాంటి వారి డేటా కూడా కనిపించడం లేదు. ఇలాంటి వారంతా అన్నదాత సుఖీభవ పథకానికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. గత నెల 25లోగా రైతులు తమ భూ వివరాలను వ్యవసాయ అధికారులకు అందజేయాలని చెప్పినా ఇప్పటికీ చాలామంది ఇవ్వలేదు. కొంతమంది రైతులు వివరాలు ఇచ్చినా వివిధ కారణాలతో వాటిని పెండింగ్‌లో పెడుతున్నారు. గడువు పెంచాలని రైతులు కోరుతున్నారు.

వివరాలు నమోదు చేస్తున్నాం



అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతుల వివరాలు నమోదు చేస్తున్నాం. కొంతమంది రైతులకు అన్ని అర్హతలు ఉన్నా వారి భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో కనిపించడం లేదు. అటువంటి వారి వివరాలను ప్రత్యేకంగా తీసుకొని అధికారులకు పంపిస్తున్నాం. కొందది రైతుల వివరాలు సాంకేతిక కారణాలతో కనిపించడం లేదు. వారికి సైతం అన్నదాత సుఖీభవ డబ్బులు జమచేస్తాం. ఎలాంటి ఆందోళన చెందవద్దు.

- లింగల మధుబాబు, వ్యవసాయశాఖ ఏడీ, పలాస

నమ్మకం ఉంది



కొండపోడు పట్టాలకు అన్నదాత సుఖీభవ డబ్బులు వస్తాయనే నమ్మకం ఉంది. కొంతమంది రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో చూపించకపోవడంతో మా గిరిజనులు భయపడుతున్నారు. అన్నదాత సుఖీభవ డబ్బులు వస్తే పోడు వ్యవసాయంలో మొక్కలు పెంచడానికి వినియోగించుకుంటాం.

- సవర గణేష్, అడ్డివాడ, మెళియాపుట్టి

యోగాలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి


యోగాసనాలు వేస్తున్న క్రీడాకారులు, అధికారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మే 31(ఆంధ్రజ్యోతి): యోగా ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తుందని, యోగాలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు అన్నారు. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో శనివారం క్రీడాకారులతో యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో పర్యాటక అధికారి నారాయణరావు, యువజన సర్వీసులు శాఖ అధికారి ఉజ్వల్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, సెట్‌శ్రీ కార్యాలయ మేనేజర్ రామారావు, సిబ్బంది, ఆయుష్ సిబ్బంది, యోగా సాధకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

బూర్జ, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఉప్పినివలస గ్రామంలో శనివారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. దీనిలో భాగంగానే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుందన్నారు. కార్య క్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



తులసీదళాలతో అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్, మే 31(ఆంధ్రజ్యోతి): చిన్న బజారులో ఉన్న దూదివారి కోవెల వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 6న నిర్వహించనున్నట్టు అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వేంకటేశ్వర స్వామిని తులసీ దళాలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తు పాల్గొన్నారు. అదేవిధంగా నానుబాల వారి వీధిలో ఉన్న విజయదుర్గా ఆలయంలో ఆలయ అర్చకులు విజయదుర్గా దేవికి పూలతోను, నూతన వస్త్రాలతోనూ, అమ్మవారి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరణ నిర్వహించారు.

అక్రమాల అనకొండ

- ఆందోళనలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది
- వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు
- ఇదీ జగతి మెట్ట జగనన్న ఇళ్ల కాలనీ తీరు

టెక్కలి, మే 31(ఆంధ్రజ్యోతి): జగతిమెట్ట జగనన్న కాలనీ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ కాలనీ వైసీపీ నేతలు, కార్యకర్తలకు ఉపాధిగా మారింది. ఎవరికి దొరికింది వారు దోచుకుతిన్నారు. ఒక్కో నేత, ఒక్కో కార్యకర్త ఐదు నుంచి 10 పట్టాల వరకు విక్రయించేశారు. ఈ అక్రమాల్లో ఆ పార్టీ నేతలే కాకుండా రెవెన్యూ అధికారుల పాత్ర ఉందనే విషయం అధికారుల దర్యాప్తులో తేలడంతో వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. జగతిమెట్ట సమీపంలోని జగనన్న కాలనీ స్థలంలో 389 పట్టాలు ఐదేళ్లలో వైసీపీ కార్యకర్తలు లబ్ధిదారులు మాటున దోచుకుతిన్నారు. విశేషం ఏమిటంటే ఇప్పటికీ ఇళ్ల పట్టాల అమ్మకాల ప్రక్రియ కొనసాగడం. గతంలో టీడీపీ హయాంలో రెవెన్యూ రికార్డులు తహసీల్దార్ కార్యాలయంలో కాలి పోగా, ఈసారి వైసీపీ ప్రభుత్వంలో లేఅవుట్ ప్లానింగ్, అప్రూవల్‌కు సంబంధించిన రికార్డులు, లబ్ధిదారుల వివరాలు, పట్టాల పంపిణీ రిజిస్ట్రేషన్లు ఇలా ఏ ఒక్క రికార్డు కార్యాలయంలో కనబడకుండా రెవెన్యూ అధికారులు కీలక సూత్రధారు లుగా పక్కా ప్రణాళికతో అక్రమాలకు సహకరించారన్న విషయం బయటపడింది. ప్రాం తాన్ని బట్టి ఒక్కో స్థలం రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విక్రయించారు. డి.పట్టా భూములకు సంబంధించి లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలు మొదలుకొని కనిపించిన ఖాళీ స్థలానికి పట్టాలు జారీ చేసి ఒకరి నుంచి ఇంకొకరికి ఇలా పట్టాలిస్తూ చేతివాటం ప్రదర్శిం స్తూ రెవెన్యూ సిబ్బంది, వైసీపీ దళారులు అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వస్తున్నాయి.


కనీస వసతులకు నోచుకోని జగతిమెట్ట జగనన్న కాలనీ

తొమ్మిది మంది అధికారుల పాత్ర

జగతిమెట్ల కాలనీకి సంబంధించి అక్రమాల్లో ఇద్దరు తహసీల్దార్లు, ఒక ఉప తహసీల్దార్, ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఒక సర్వేయర్, ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్, ముగ్గురు వీఆర్వోల పాత్ర ఉన్నట్లు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తన దర్యాప్తులో గుర్తించారు. అయితే గతంలో అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ సిబ్బందే ఇప్పటికీ తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తుండడం గమనార్హం. రెవెన్యూ సిబ్బంది అవినీతిని గుర్తించిన అధికారులు సైతం వారిపై సిఫారసులకే పరిమితం కావడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. 190 వరకు ఇళ్ల కాలనీలు రద్దు చేస్తామని ఆర్డీవో ప్రకటించిన నేపథ్యంలో వారి గుండెల్లో రైళ్లు పడుతున్నాయి. కొండను పట్టి ఎలుకను తవ్విన చందంగా రెవెన్యూ అధికారులు వ్యవహరించారన్న ఆరోపణలు లేకపోలేదు.

కంచమ్మ సంబరాలు



- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- దత్తత గ్రామాల్లో సందడే సందడి


కంచమ్మతల్లి ఆలయం

కంచిలి, మే 31(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలోని వివిధ గ్రామాల్లో గ్రామదేవతల సంబరాలు విరివిగా నిర్వహిస్తున్నారు. ఈ కోవలోనే కంచిలి మండల కేంద్రంలో జూన్ ఒకటో తేదీ నుంచి పది రోజుల పాటు గ్రామ దేవత కంచమ్మ తల్లి సంబరాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కంచిలితోపాటు కంచమ్మ తల్లి ఆలయ దత్తత గ్రామాలైన గొల్లకంచిలి, ఎస్.ఆర్.సి.పురం, పద్మతుల, బలియాపుట్టుగ, మఠం కంచిలి, పురుషోత్తపురం, బాసుబంజిరి గ్రామాలు కూడా ఉత్సవాలకు సిద్ధమవుతున్నాయి.


కార్యక్రమాలు ఇలా..

కంచమ్మ తల్లి సంబరాలను పది రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొదటి రోజైన జూన్ ఒకటో తేదీన ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, స్థల శుద్ధి కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం భజన కాలక్షేపం నిర్వహిస్తారు. రాత్రి ఎనిమిది గంటలకు మేళతాళాలతో దేవాలయం నుంచి అమ్మవారిని పీఠాసనం వద్దకు తీసుకు వస్తారు. రెండో రోజు సోమవారం సాయంత్రం అమ్మవారి ఆభరణాల పెట్టెను ఊరేగిస్తారు. ఆపై ప్రతి రోజూ సాయంత్రం అమ్మ వారిని స్థానికంగానే కాకుండా దత్తత గ్రామాల్లో ఊరేగిస్తారు. చివరి రోజున అమ్మవారి అనుపు ఉత్సవం నిర్వహిస్తారు. ఊరేగింపులో నేలవేషాలు, బళ్ల వేషాలు, గరిడీ, కర్రసాము వంటి ప్రదర్శనలు, రాత్రి వేళల్లో సినీ, టీవీ కళాకారులతో సాం స్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

అయిదేళ్లకోసారి..

ఏటా కంచిలిలో కంచమ్మ తల్లి చల్లదనం సంబరాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయిదేళ్లకోసారి దత్తత గ్రామాలన్నింటితో కలిపి పెద్ద ఎత్తున సంబరాలను నిర్వహిస్తుంటారు. ఈసారి మూడు నెలల ముందు నుంచే సంబరాలకు సంబంధించిన ఏర్పాట్లు ప్రారంభించారు. దత్తత గ్రామాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, విరాళాల సేకరణ, సంబరాల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. కంచిలి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో విద్యుత్ దీపాలతో అలంకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు.


మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న గేట్



ఆకాశానికి రంగులద్దినట్టు..

టెక్కలి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆకాశానికి రంగులద్దినట్లున్న దృశ్యం శనివారం సాయంత్రం 6.50 గంటల సమయంలో టెక్కలి మండలం కొల్లివలసలో ఆవిష్కృతమైంది. సింధూర వర్ణమై నీలిమబ్బులు చాటున జారుతూ మైమరిపించింది. ఈ దృశ్యాన్ని కనులారా వీక్షించి స్థానికులు ఆనందం పొందారు.

అన్నింటికంటే ప్రాణం విలువైనది



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీధర్

శ్రీకాకుళం లీగల్, మే 31(ఆంధ్రజ్యోతి): అన్నింటికంటే ప్రాణం అత్యంత విలువైనదని శ్రీకాకుళం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎం.శ్రీధర్ అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో గల న్యాయసేవా సదన్‌లో లీగల్ వలంటీర్లతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనం నడపకూడదన్నారు. ట్రాఫిక్ సీఐ నాగరాజు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

కలప తరలింపుపై విజిలెన్స్ తనిఖీలు

లావేరు, మే 31(ఆంధ్రజ్యోతి): బెజ్జిపురం జంక్షన్ వద్ద గల జాతీయ రహదారిపై చిల్లపేటకు చెందిన సిల్లా శంకరరావు శనివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న రూ.23,700 విలువ గల 43 అకేష్ కలప దుంగలను, వాహనాన్ని విజిలెన్స్, అటవీశాఖ అధికారులు సీజ్ చేశారు. తనిఖీల్లో డిప్యూటీ రేంజ్ అధికారి గౌరీశంకర్, విజిలెన్స్ అధికారులు సతీష్ కుమార్, సీఐ రామారావు, పీసీలు ఈశ్వరరావు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

జి.సిగడాం, మే 31(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) అన్నారు. శనివారం జి.సిగడాం, కప్పరాం గ్రామాల్లో ఆయన పర్యటించి గ్రామల్లో గల సమస్యలపై గ్రామస్థుల నుంచి ఆరా తీశారు. 'నమస్తే ఎచ్చెర్ల- మన ఊరికి మన ఎమ్మెల్యే' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

ముగిసిన ఆలయ ప్రారంభోత్సవం

జి.సిగడాం, మే 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల అసిరితల్లి ఆలయ పునః ప్రారంభోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. గ్రామ పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకు, చీరలు, ముర్రాటలు చెల్లించుకొని చల్లగా చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా వేలాది మందికి అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. అలాగే కప్పరాంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ముగిశాయి. రెండు గ్రామాల్లో గల ప్రతిష్ఠా మహోత్సవాల్లో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకటేశ్వరరావు, ముద్దాడ గౌరీశ్వరరావు, వజ్జపర్తి రఘురాం, కుదిరెళ్ల బుజ్జి, గట్టెం అప్పలరాజు, దుర్గాసి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పునరుద్ధరణ

పొందూరు, మే 31(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో కక్షసాధింపు చర్యల్లో భాగంగా తొలగించిన ఎనిమిది మంది టీడీపీ సానుభూతిపరుల పింఛన్లు పునరిద్ధరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీకి అనుకూలంగా ఉన్నారనే నెపంతో అర్హులైనవారి పింఛన్లు తొలగించారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కనికరించలేదు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాలతో పింఛన్లు పునరుద్ధరించారు. ఈ మేరకు లబ్ధిదారులకు శనివారం టీడీపీ నాయకులు, అధికారులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ప్రధాన కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, నాయకులు నాగేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు

పురపాలక పరిధిలో పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస, మే 31(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని 10, 11వ వార్డుల్లోని మెట్టక్కివలసలో కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. శనివారం ఉదయం మెట్టక్కివలసకు చెందిన నియోజకవర్గ యాదవ సంఘ నాయకుడు, టీడీపీ నాయకుడు నాగళ్ల మురళీధర్‌తో కలిసి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రాచకొండ రాజు, సచివాలయ పురపాలక సంఘం అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో నైపుణ్యాభివృద్ధి ఉండాలి

ఆమదాలవలస, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో నైపుణ్య అభివృద్ధి చెందితే వారు సమాజానికి మేలు చేస్తారని సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు అన్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్ భజన మండలి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శనివారం గత 45 రోజులుగా శిక్షణ పొందుతున్న కంప్యూటర్ విద్యార్థులు, సంగీత శిక్షణ, టైలరింగ్ పొందుతున్న సుమారు 72 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జోనల్ కన్వీనర్ ఎం.జనార్దన సాయి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఇన్‌చార్జి ఎం.రవీంద్రబాబు, జిల్లా బాల వికాస్ రిసోర్స్ పర్సన్ లాడె చంద్రశేఖర్‌మాస్టార్, జిల్లా మెడికల్ ఇన్‌చార్జి పి.తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కుల రక్షణే ఐక్యవేదిక లక్ష్యం

పొందూరు, మే 31(ఆంధ్రజ్యోతి): దళితుల హక్కుల కాపాడడమే లక్ష్యంగా దళిత ఐక్య వేదికను ఏర్పాటుచేయడం జరిగిందని దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకులు కల్లేపల్లి రామ్‌గోపాల్ అన్నారు. మండల కేంద్రం పొందూరులోని ఓ ప్రైవేట్ డిగ్రీకళాశాలలో శనివారం నిర్వహించిన జిల్లా దళిత ఐక్యవేదిక సర్వసభ్య సమావే శంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దళిత ఐక్యవేదిక జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బొచ్చు బుద్ధుడు, జిల్లా అధ్యక్షుడిగా సాకే టి.నాగరాజు, ఉపాధ్యక్షులుగా గూన కృష్ణ, కుమిలి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా రాకోటి ప్రసాదరావు, కోశాధికారిగా నల్లబారికి అప్పారావు ఎన్నికయ్యారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ఆమదాలవలస, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తే రైతులకు ఎంతో మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కార్యాలయంలో ఖరీఫ్‌లో జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగును చేపడతారని, ఈ వరి పంట వేయడానికి ముందుగా ప్రకృతి సేద్య పద్ధతిలో నవధాన్య సాగును చేపట్టాలన్నారు.

కంచమ్మతల్లి సంబరాలకు ఆహ్వానం

కంచిలి, మే 31(ఆంధ్రజ్యోతి): జూన్ 1వ తేదీ నుంచి కంచిలిలో నిర్వహిస్తున్న కంచమ్మతల్లి సంబరాలకు కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, డీఆర్వో వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు కిరణ్‌కుమారులకు ఆహ్వాన పత్రికలు అందించారు.

ఆటోలకు క్యూఆర్ కోడ్

సోంపేట, మే 31(ఆంధ్రజ్యోతి): ఆటోలకు క్యూఆర్ కోడ్‌తో స్టిక్కర్లను సీఐ మంగరాజు, ఎస్ఐ లవరాజు అంటించారు. సోంపేట స్టేషన్ పరిధిలో ఉన్న 40ఆటోలకు స్టిక్కర్లను శనివారం అంటించారు. ఈ కోడ్ ద్వారా డ్రైవర్ల వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

'ఉపాధి' పనులపై అలసత్వం ఎందుకు?

- గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణరావు
- బొరిగివలస రోడ్డు పనులపై అసంతృప్తి
- పీఆర్ ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం



పీఆర్ ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రిన్సిపాల్ సెక్రటరీ శశిభూషణరావు

నరసన్నపేట, మే 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులంటే అంత అలుసెందుకని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం ఆయన చిన్న బొరిగివలస వద్ద రూ.30 లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పోలాకి రోడ్డు నుంచి చిన్నబొరిగివలస గ్రామానికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డును పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. బెర్మలపై నిల్చునేందుకు ప్రయత్నించిన ఆయనకు అక్కడ నిల్చుంటే కుంగుతుందని పంచాయతీరాజ్ ఈఈ చెప్పడంతో అసంతృప్తి వ్యక్తంచేశారు.

కలెక్టర్ గారూ మీరూ చూడండి..

కొంత దూరంలో బెర్మలు వర్షాలకు కొట్టుకుపోయిన విషయాన్ని గమనించిన ప్రిన్సిపల్ సెక్రటరీ.. కలెక్టర్ గారూ రోడ్డు పరిస్థితి చూడండంటూ ఆ దృశ్యాన్ని చూపించారు. సీసీ రోడ్డు కిందకు కొంత మట్టి కొట్టుపోవడాన్ని పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులపై మండిపడ్డారు. డీఈఈ, ఏఈఈలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రోడ్డుకు ఇరువైపులా ఎన్ని ప్రాంతాల్లో పైపులు వేశారో తెలియజేయాలని కోరగా ఇంజనీరింగ్ అధికారులు తెల్లముఖం వేశారు. చిన్న బొరిగివలస వద్ద ఇదే రోడ్డుకు వేసిన కల్వర్టు పనులను పరిశీలించి పైపులు రెండు వైపులా సరిగా లేకపోవడంతో అసహనం వ్యక్తంచేశారు. పీఆర్ ఈఈ నరసన్నపేటలో పనిచేసిన డీఈఈ చాలా సమర్థుడని పదేపదే చెప్పడంతో ఆయనపై మండిపడ్డారు.

మన మంత్రి ఎవరు?

అనంతరం బొరిగివలస గ్రామంలో ఉద్యాన వనశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మామిడితోటల పెంపకం, ఫాంపాండ్‌ను పరిశీలించారు. అక్కడ ఉపాధి వేతనదారులతో మాట్లాడుతూ.. మన మంత్రి పేరు చెప్పండని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ అని వారు చెప్పగానే ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఫాంపాండ్‌ను పరిశీలించి అక్కడి పనులపై అసంతృప్తి చెందారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆవరణలో తీసిన ఇంకుడు గుంతను పరిశీలించారు. అనంతరం నియోజకవర్గంలో చేపట్టిన ఉపాధి పనులపై అధికారులు ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా దానిని ప్రిన్సిపల్ సెక్రటరీ పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీపీవో భారతి సౌజన్య, శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డ్వామా పీడీ సుధాకర్, ఏపీడీలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నడిపించాలి

రణస్థలం, మే 31(ఆంధ్రజ్యోతి): పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత సర్పంచులదేనని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషనరావు అన్నారు. బుంటుపల్లి గ్రామంలో శనివారం చేపట్టిన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటి వద్ద ఎరువుల గుంత, పశువుల తొట్టె ఏర్పాటు చేయించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బంటుపల్లి పంచాయతీ అభివృద్ధిని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు వివరించారు. సచివాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సర్పంచ్ నడుకుదిటి రజిని తదితరులు పాల్గొన్నారు.

మృత్యు తీగలు

(5వ పేజీ తరువాయి)

బిల్లులను ముక్కుపిండి వసూలు చేస్తున్న ఆ శాఖ అధికారులు ప్రజల ప్రాణాల రక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. తీగలు వేలాడుతున్నా, ఇళ్ల పైనుంచే లైన్లు వెళ్తున్నా సరిచేయడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కంచెలను ఏర్పాటు చేయడం లేదు. రైతుల పంపు సెట్ల వద్ద రక్షణ చర్యలు శూన్యం. కొంతమంది కాంట్రాక్టర్లు ఎటు వంటి కాంక్రీట్ లేకుండా హెచ్‌టీ పోల్స్ వేస్తున్నారు. ఇవి చిన్నపాటి గాలులకే వాలిపోయి, తీగలు తెగిపడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందితో పాటు పర్యవేక్షించే అధికారులు లేరు. అసిస్టెంట్ లైన్‌మెన్లు, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, ఏడీల కొరత అధికంగా ఉంది. పదవీవిరమణతో చాలా పోస్టులు ఖాళీ అవుతున్నా వాటిని భర్తీ చేయడం లేదు. అటు బదిలీలు, పదోన్నతులతో చాలా పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. దీంతో వినియోగదారులకు అత్యవసర సేవలు అందడం లేదు. అటు పాడైన విద్యుత్ పరికరాలతో సిబ్బంది కుస్తీలు పట్టాల్సి వస్తోంది.

భయపెడుతున్నాయి..

ప్రస్తుతం పొలాలతో పాటు రోడ్ల వెంబడి ఉన్న హైటెన్షన్ వైర్లు భయపెడుతున్నాయి. చాలావరకూ స్తంభాలకు సపోర్టింగ్ వైర్లు లేక ఒక వైపు వేలాడుతున్నాయి. ప్రస్తుతం ఈదురుగాలులు వీస్తుండడంతో ఎప్పుడు కూలిపోతాయో తెలియని స్థితిలోకి మారాయి. వాస్తవానికి హైటెన్షన్ విద్యుత్ లైన్లకు సంబంధించి స్తంభాల మధ్య 50 మీటర్ల నిడివి ఉండాలి. కానీ, ఈ నిబంధన పాటించడం లేదు. ప్రతీ స్తంభం 4 అడుగుల లోతులో పాతాలి. సమపాళ్లలో కాంక్రీట్ వేసి బలోపేతం చేయాలి. స్తంభం విడిచి స్తంభానికి సపోర్టింగ్ వైరు వేయాలి. ఫీజు బాక్సు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన స్తంభానికి సపోర్టుగా మరో స్తంభాన్ని అడ్డంగా ఏర్పాటు చేయాలి. కానీ, ఇవేవీ చేయలేదు. దీంతో ఎక్కడికక్కడే స్తంభాలు గాల్లో వేలాడుతున్నాయి. ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో రహదారులపై ప్రయాణించే వారు, వాహన చోదకులు భయపడిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,600 వరకూ రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. దాదాపు 300 మంది వరకూ మాత్రమే సిబ్బంది ఉన్నారు. వర్షాకాలం, ఈదురుగాలుల సమయంలో సిబ్బందిపడే బాధలు వర్ణనాతీతం. దీనికి తోడు దశాబ్దాల కిందట వేసిన స్తంభాలు, విద్యుత్ లైన్లు ఎప్పటికప్పుడు పాడవుతున్నాయి. వాటిని సరిచేయాల్సిన ప్రభుత్వం మిన్నకుండాపోతోంది. అటు ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఏళ్లతరబడి మార్చడం లేదు. దీంతో తరచూ మొరాయిస్తున్నాయి.

సమస్యలు పరిష్కరిస్తున్నాం

జిల్లాలో విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తున్నాం. సిబ్బంది కొరత మాట వాస్తవమే. అయినా ఉన్న సిబ్బందితో పనిచేయిస్తున్నాం. ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. వర్షాకాలం కావడంతో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అటు గ్రామాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు సైతం మంచి సేవలు అందిస్తున్నారు.

- ఎన్.కృష్ణమూర్తి, ఎస్ఈ, విద్యుత్‌శాఖ, శ్రీకాకుళం

45 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పొందూరు, మే 31(ఆంధ్రజ్యోతి): బి.కంచరాం గ్రామంలో నిర్మించిన 45 అడుగుల సుబ్రహ్మణ్య సహిత అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. వారం రోజులుగా ఈ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ముస్లిం కుటుంబం పాల్గొని మతసామరస్యం వెల్లివిరిసేలా చేశారు. షేక్‌సాయిబు కుటుంబం భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శనివారం చివరి రోజు సీతారాముల కల్యాణం, విగ్రహ ప్రతిష్ఠ, స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ సాధు పరిషత్ స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హనుమాన్ ఉపాసకులు చిన్నదాన చిదంబరం స్వామి, రామానంద పరమహంస జ్ఞానయోగశాల స్వామి అంతార్మఖానంద హనుమాన్ జీవిత కథను భక్తులకు వివరించారు. చివరిరోజుల స్వామిని వేలాదిమంది భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. వేలాది మంది అన్నసమారాధనలో పాల్గొన్నారు.

మహిళల రక్షణకే సురక్ష క్యూఆర్ కోడ్



ఆటోకు సురక్ష క్యూఆర్ కోడ్‌ను అతికిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులు రక్షణే లక్ష్యంగా సురక్ష క్యూఆర్ కోడ్ యాప్‌ను ప్రతి ఆటోకు అంటిస్తున్నట్టు టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం శ్రీకాకుళం నగరంలోని సింధూర ఆటో స్టాండ్ వద్ద పలు ఆటోలకు సురక్ష క్యూఆర్ కోడ్‌ను అంటించారు. ఈ సందర్భంగా సిఐ ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ తమ వ్యక్తిగత వివరాలతో సురక్ష క్యూఆర్ కోడ్‌ను తప్పనిసరిగా అతికించుకోవాలని తెలిపారు. దీని ముఖ్య ఉద్దేశ్యం ఆటోలో ప్రయాణం చేసే ప్రయాణికులకు భద్రత కల్పించడమేనని ఆయన తెలిపారు. నగరంలో తిరుగుతున్న ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ తమ ఆటోలకు సురక్షా క్యూఆర్ కోడ్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకొని అతికించుకోవాలని ఆయన కోరారు.

'చలో విజయవాడ' విజయవంతం చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 31(ఆంధ్రజ్యోతి): మూడో రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు జూన్ 5న జరుగనున్న సందర్భంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.సోమేశ్వరరావు, ఎం.సంతోష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి జి.తిరుపతిరావు పిలుపునిచ్చారు. నగరంలోని చిన్నబజారు రోడ్డులో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిట్టింగ్ జడ్జితో 12వ పీఆర్సీ కమిషన్ నియమించాలని, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇప్పిలి నారాయణరావు, పైల రవి, పి.నాగేశ్వరరావు, సూర్యచంద్ర, కె.రాజేశ్వరరావు, అప్పలనాయుడు, ఇతర సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తీర గ్రామాల్లో అవగాహన సదస్సులు

ఎచ్చెర్ల, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తదిబ్బలపాలెం, పాతదిబ్బలపాలెం గ్రామాల్లో కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.హరికృష్ణ శనివారం అవగాహన సదస్సులను నిర్వహించారు. చేపల వేటకు వెళ్లేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై మత్స్యకారులకు వివరించారు. అపరిచిత, అనుమానస్పద వ్యక్తులు కన్పించినా, ఎవరైనా నిషేధం వస్తువుల అక్రమ రవాణా చేసినా వెంటనే మెరైన్, స్థానిక పోలీస్ స్టేషన్‌లకు సమాచారం అందించాలన్నారు. టోల్ ఫ్రీ నెంబరు 1093, 93929 14712కు తెలియజేయాలన్నారు.

ప్రాణాలు తీసిన పిడుగులు

(5వ పేజీ తరువాయి)

శనివారం పిడుగు పడి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పలనాయుడు సాయంత్రం 4.30 గంటల సమయంలో తన పొలానికి వెళ్లాడు. ఇంతలో ఒకేసారి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పొలం పని చేసుకుంటున్న అప్పలనాయుడుపై చలి పిడుగు పడింది. దీంతో అతని శరీరమంతా చల్లబడిపోయి స్పృహ కోల్పోయాడు. గ్రామస్థులు సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తహసీల్దార్ ఎల్.మధుసూదన్, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ పీహెచ్‌సీని సందర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొని మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అప్పలనాయుడుకు భార్య సావిత్రమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సరుబుజ్జిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో శనివారం ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమంలో శ్రీకాకుళం, గార మండలాల నుండి వచ్చిన వారి నుంచి పెద్దఎత్తున వినతులను స్వీకరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏయూ నుంచి మాలతికి డాక్టరేట్



ఎచ్చెర్ల, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రివలెన్స్ యాండ్ టాక్సోనమీ ఆఫ్ గ్యాస్ట్రోయిన్టెస్టినల్ హెల్మిన్తే పారాసైట్స్ ఆఫ్ డొమిస్టిక్ రొమినెంట్స్‌పై ఫ్రమ్ విశాఖపట్నం అండ్ శ్రీకాకుళం అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ (విశాఖపట్నం)లో జంతు శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని సనపల మాలతి డాక్టరేట్ సాధించారు. శ్రీకాకుళం నగరానికి చెందిన ఈమె ఏయూ ప్రొఫెసర్ యు.షమీమ్ పర్యవేక్షణలో పరిశోధన జరిపారు. ఈ అధ్యయనంలో గ్యాస్ట్రోయి న్టెస్టినల్ హెల్మిన్తే పరాన్న ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ఈమెకు పీహెచ్‌డీని అందజేశారు.

పిడుగుపడి ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

సరుబుజ్జిలి, మే 31(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి గ్రామ పరిధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై శనివారం పిడుగుపడి ధ్వంసమైంది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఉరుములు మెరుపులతో ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగుపడింది. దీంతో అంతా అంధకారంగా మారింది. రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

'వెన్నుపోటు దినం' జయప్రదం చేయండి

కంచిలి, మే 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో జూన్ 4న ఇచ్ఛాపురంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వైసీపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్నివి జయవంతం చేయాలన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

పాత శ్రీకాకుళం, మే 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల 2024-25 విద్యా సంవత్సరం నాలుగో సెమిస్టర్ ఫలితాలు శనివారం ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి విడుదల చేశారు. బీఏ 84.69 శాతం, బీకాం 89.81శాతం, బీఎస్సీ 82.35 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి శంకరనారాయణ, సీహెచ్ కృష్ణారావు, ఎస్ పద్మావతి, పీఎస్ కనకదుర్గ, వై.ప్రశాంతి, కాత్యాయని, కె.సంతోష్ పాల్గొన్నారు.

ఆక్రమణల గుర్తించకుండా.. తొలగింపు చర్యలేలా?

ఇచ్ఛాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు గుర్తించకుండా తొలగించేందుకు అవసరమైన యంత్రాలు, పనిముట్లు అద్దెకు తీసుకొనేందుకు నిధులు కేటాయించడమేంటని 9వ వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్ అధికారులను ప్రశ్నించారు. శనివారం మునిసిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. అజెండాలో పొందిపరిచిన తొమ్మిది అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో ఆక్రమణలు తొలగించే ప్రక్రియలో భాగంగా పనిముట్లు అద్దెకు తీసుకొనేందుకు నిధులు కేటాయించడంపై వైస్ చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపాల్టీలో ఆక్రమణలు ఉన్నా అనాధికార కట్టడాలు ఉన్నా ముందుగా నోటీసులు జారీ చేసి తర్వాత చర్యలు తీసుకోవాలన్నారు. నిధులు దుర్వినియోగం చేయకుండా ఉన్న యంత్రాలు, పనిముట్లతో ఆక్రమణలు తొలగించాలని 11వ వార్డు టీడీపీ కౌన్సిలర్ ఆశి లీలారాణి సూచించారు. ముగ్గురు కౌన్సిలర్లు అభ్యంతరాలు తెలిపినప్పటికీ మెజార్టీ కౌన్సిలర్లు ఆమోదం తెలపడంతో ఈ అంశాన్ని ఆమోదించారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్ ఆశి లీలారాణి అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం, మే 31(ఆంధ్రజ్యోతి): పెంట గ్రామంలో గల షిర్డీసాయి ఆలయ 12వ వార్షికోత్సవం ఆదివారం నుంచి నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం కాకడహారతి, సుప్రభాతసేవ, సత్సంగం, సాయి సత్యవ్రతాలు, ఊరేగింపు వంటి కార్యక్రమాలతో అన్న సమరాధన ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ట్రావెలర్స్‌కు ఆశ చూపి గంజాయి రవాణా

● మడపాం వద్ద ఇద్దరి అరెస్టు : ఏఎస్పీ శ్రీనివాసరావు


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

నరసన్నపేట, మే 31(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ట్రావెలర్స్‌ను ఎంచుకొని గంజాయిని జిల్లా మీదుగా తరలిస్తున్న ఇద్దరిని మడపాం టోల్‌ప్లాజా వద్ద అరెస్టు చేసినట్లు ఏఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆ వివరాలు ప్రకటించారు. ఈ మేరకు.. శనివారం ఉదయం మడపాం టోల్‌ప్లాజా వద్ద ఎస్‌ఐ దుర్గాప్రసాద్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఒక వాహనం నుంచి దిగి బ్యాగ్‌తో పారిపోతున్న పర్లాకిమిడికి చెందిన ముక్తిపరిషా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతను 13 కిలోల గంజాయిని చెన్నై రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. చెన్నై చేరిన తరువాత ఈ బ్యాగ్ ఎవరికి అప్పగించాలో ఫోన్‌లో తెలపడం జరుగుతుందని, పర్లాకిమిడిలో రాజేష్ గంజాయి అందించినట్లు దర్యాప్తులో తేలిందని ఏఎస్పీ తెలిపారు. అలాగే శనివారం సాయంత్రం మడపాం వద్ద వాహనాలను పరిశీలిస్తున్న సమయంలో మరో వాహనంలో ఒక మహిళ దిగి వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆమె పేరు రత్నకర్ జిన్ని అని, ఆమె కటక్ నుంచి హైదరాబాద్‌కు 10.8 కేజీలు గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచనున్నామన్నారు. ఒడిశానుంచి గంజాయిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ట్రావెలర్స్‌ను అధికంగా డబ్బులు ఆశచూపి రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. గంజాయి రవాణాను అడ్డుకున్న నరసన్నపేట ఎస్‌ఐ దుర్గాప్రసాద్, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సీఐ ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

● 8 మంది అరెస్టు, రూ.1.42 లక్షలు స్వాధీనం

పలాస, మే 31(ఆంధ్రజ్యోతి): పలాస మండలం తర్లాకోట గ్రామ సరిహద్దులో పేకాట శిబిరంపై శనివారం ఎస్‌ఐ నర్సింహమూర్తి, సిబ్బంది దాడి చేశారు. ఇందులో 8 మందిని పట్టుకుని వారి నుంచి రూ.1.42 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేంకటేశ్వరకాలనీలో కార్డెన్ సెర్చ్

పలాస, మే 31(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వర కాలనీ (కీర్తిరాయి చెరువుగట్టు) వద్ద శనివారం వేకువజామున సీఐ పి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని 27 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు గాను అనుమానిత ప్రాంతాల్లో ఎస్పీ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి అనుమానితులు ఉంటే వారిని ప్రశ్నించడంతో పాటు ఆధార్‌కార్డులు పరిశీ లించా మన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నర్సింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌సీపై దాడి చేసిన ఇద్దరికి జైలుశిక్ష

శ్రీకాకుళం క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు శ్రీకాకుళం సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ న్యాయాధికారి శివరామకృష్ణ 20 రోజుల శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు శ్రీకాకుళం టౌన్ సీఐ పి.పైడపునాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. స్థానిక మంగువారి తోటలో నివాసం ఉంటున్న పొన్నాడ త్రినాథరావు హెడ్ కానిస్టేబుల్‌గా (ప్రస్తుతం శ్రీకాకుళం డీసీఆర్‌బీ) పనిచేస్తున్నారు. మే 29న రాత్రి 7.20 గంటల సమయంలో ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళుతున్నారు. ఈ సమ యంలో లెపర్సీ కాలనీ జంక్షన్ వద్ద బోడెమ్మ కోవెల వీధికి చెందిన వెల్లంపూడి రాజేష్, దమ్మల వీధికి చెందిన పొట్నూరు వాసు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ దారిని పోయే వారిపై అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా గమనించిన హెచ్‌సీ త్రినాథరావు మీరు చేస్తున్న పని తప్పని వారించగా మద్యం మత్తులో ఉన్న ఆ ఇద్దరు కలిసి అతనిపై చేతులతో దాడి చేశారు. రక్తం కారినట్లు గాయపరిచారు. సమాచారం తెలుసుకున్న శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ బి.రామారావు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. డ్రంకెన్ డ్రైవ్‌ను బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా ఇరువురు మద్యం సేవించినట్టు నిర్ధారణ కావడంతో వారిని శ్రీకాకుళం సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి శివరామకృష్ణ ఒక్కొక్కరికి 20 రోజులు చొప్పున జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇవ్వడంతో జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో సచివాలయ ఉద్యోగి మృతి


దాలినాయుడు (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, మే 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం ఇందిరానగర్ కాలనీలో నివసిస్తున్న సచివాలయ ఉద్యోగి పల్లె దాలి నాయుడు (30) శనివారం వేకువ జామున గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. శ్రీకాకుళం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దాలినాయుడు శ్రీకాకుళం సానావీధి సచివాలయంలో ఎమినిటీస్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నాడు. పింఛన్ల పంపిణీ 31న పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో శనివారం ఉదయం 4.30 గంటలకు భార్య మాధురి నిద్రలేపింది. ఎంతకీ మెలుకవలోకి రాకపో వడంతో ఆవేదనకు గురై పక్క రూమ్‌లో ఉంటున్న అత్తామామలకు తెలపగా వారు వచ్చి చేసేసరికే దాలినాయుడు నోటి నుంచి నురగలు రావడంతో మృతి చెందినట్లు భావించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ రాముకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి ఎస్‌ఐ రాము దర్యాప్తు చేపట్టారు. జలుమూరు మండలం చల్లపేటకు చెందిన పల్లె దాలినాయుడు ఉద్యోగ రీత్యా శ్రీకాకుళం రూరల్ మండలం ఇందిరానగర్ కాలనీలో నివసిస్తున్నాడు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు

శ్రీకాకుళం క్రైం, మే 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాకర్‌సాహెబ్‌పేటలో ఓ ఇంటిలో బీరువా నుంచి రూ.25 వేలు నగదు అపహరించిన కేసులో ఇద్దరిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి నట్లు టూటౌన్ సీఐ ఈశ్వరరావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఈనెల 28న మధ్యాహ్నం ఇంటి తలుపులు బద్దలు కొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించి తన బెడ్ రూమ్ బీరువాలో ఉన్న రూ.25 వేలు నగదును దొంగిలించినట్టు బాకర్‌సాహెబ్‌పేటకు చెందిన బంటుపల్లి భాను ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను గుర్తించగా వారిలో విశాఖపట్నం పెద్దవాల్తేరు జాలరిపేటకు చెందిన మజ్జి జస్వంత్‌ను అదుపులోకి తీసుకొని విచారించినట్టు తెలిపారు. మరో వ్యక్తి, అతని స్నేహితుడు భాను ప్రకాష్‌గా గుర్తించామని, అతడు పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. మజ్జి జస్వంత్‌ను రిమాండ్‌కు తరలించామన్నారు. ఇతడి పై విశాఖపట్నం, ఏలూరుల్లో పలు కేసులు ఉన్నట్లు సీఐ ఈశ్వరరావు తెలిపారు.

శ్మశానవాటిక అభివృద్ధి పట్టదా?

● మునిసిపల్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం


మాట్లాడుతున్న సీనియర్ టీడీపీ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ

పలాస, మే 31(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పట్టణ ప్రజలు వినియోగించే చాకలి చెరువు వద్ద ఉన్న శ్మశాన వాటికను ఎందుకు అభివృద్ధి చేయడం లేదని, లక్ష మంది వినియోగించే దీనిపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన శనివారం మునిసిపల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. కాశీబుగ్గలో ఉన్న అన్ని వార్డు ప్రజలు అంత్యక్రియ లకు ఈ శ్మశానవాటికను వినియోగిస్తారని, అయితే దీనిని అభివృద్ధి చేయకపోవడంపై ఆయ న ఆగ్రహం వ్యక్తంచేశారు. నాలుగు ఎకరాల్లో ఉన్న ఈ శ్మశానవాటికకు శవ దహనాలకు వెళి తే అక్కడి పరిస్థితులతో ఆందోళనతో బయటకు రావాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన వాటికలో లైట్లు, రోడ్లు, శవదహనం భవనాలు, విశ్రాంత భవనాలు, మంచినీరు పూర్తిగా లేదని, గేట్లు సైతం దొంగలపాలయ్యాయన్నారు. దీనిపై చైర్మన్ బళ్ల గిరిబాబు మాట్లాడుతూ.. గతంలో రూ.15 లక్షలతో అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచామని, పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. కమిషనర్ ఎన్.రామారావు మాట్లాడుతూ శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఒకరి ఫిర్యాదుతో మొత్తం అభివృద్ధి ఆగిపోతోంది

మాజీ కోఆప్షన్ సభ్యురాలి భర్త బుల్లు ప్రధాన్ నిరంతరం మునిసిపాలిటీలో అభివృద్ధి పనులపై సీఎంవో, విజిలెన్స్ అధికారులకు ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నారని, దీనివల్ల పనులు నిలిచిపోతున్నాయని, ఇకపై ఆయన ఫిర్యాదులపై స్పందించకుండా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని కౌన్సిలర్లు కోరగా ఆ మేరకు తీర్మానంచేశారు. ఈ మేరకు వైసీపీ కౌన్సిలర్ సనపల సింహాచలం తొలుత ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఐదేళ్లలో అనేక అభివృద్ధి పనులకు ఆమోదం తీసుకున్నా బుల్లు ప్రధాన్ ఇచ్చిన ఫిర్యాదులతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. కౌన్సిలర్లకు ఇవ్వని ప్రాధాన్యం ఫిర్యాదుదారునికి ఇవ్వడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అంశంపై టీడీపీ సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్ని ఫిర్యాదులు చేసినా ఒక్కటి కూడా నిరూపించలేకపోయారని, ఫిర్యాదు చేశారని పనులు నిలిపితే పాలకవర్గానికి చెడ్డపేరు వస్తుందన్నారు. గోప్యంగా ఉండాల్సిన అజెండా కాపీలను వాట్సాప్‌లో చక్కర్లు కొట్టడాన్ని కౌన్సిలర్ శ్రీకాంత్ తప్పుబట్టగా, ఇకపై అటువంటివి ఉండవని కమిషనర్ వివరణ ఇచ్చారు.

అద్దె భవనంలోకి పలాస మున్సిఫ్ కోర్టు


కొత్త మెజిస్ట్రేట్ కోర్టు వద్ద న్యాయాధికారి, న్యాయవాదులు, అధికారులు

పలాస, మే 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయం రోడ్డులో ఉన్న పాత ఎస్ఎఫ్ఎస్ స్కూల్ భవనంలో పలాస మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటు చేశారు. కొత్త భవనాలు మంజూరైనా నిర్మాణంలో జాప్యం ఏర్పడడంతో ప్రస్తుతం అద్దె భవనంలోనే కోర్టును నిర్వహిస్తున్నారు. కక్షిదారులు, న్యాయవాదుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శనివారం స్కూల్ ఆవరణలోకి చేశారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జూలై 5న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, ఎంపీడీవో వసంతకుమార్, ఎంఈవో శ్రీనివాస్ సీఐ సూర్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫయ్యాజ్ అహ్మద్(ఘని) తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

నరసన్నపేట, మే 31(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జూలైలో నిర్వహించనున్న లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వాణి అన్నారు. శనివారం స్థానిక కోర్టులో పోలీసు, ఎక్సైజ్, బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రాజీ అయ్యే కేసులను గుర్తించి మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి వాణి

'నంబాళ్ల' కుటుంబానికి నేతల పరామర్శ


కేశవరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కూన రవికుమార్ తదితరులు

టెక్కలి, మే 31(ఆంధ్రజ్యోతి): మావోయిస్ట్ చీఫ్ నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవ రాజు మే 21న ఛత్తీస్‌ఘడ్ సమీపంలోని నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన నేపథ్యంలో శనివారం స్వగ్రా మం జీయన్నపేటలో ఆయన కుటుంబాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, వైసీపీ నాయకులు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. అలాగే టెక్కలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పేడాడ తిలక్, జడ్పీటీసీ దువ్వాడ వాణి పరామర్శించారు. కేశవరావు తల్లి భారతమ్మను, సోదరులు నంబాళ్ల ఢిల్లేశ్వరరావు, రాం ప్రసాద్‌లను ఓదార్చారు. తమకు చివరి చూపుగా మృతదేహం ఇవ్వలేదని, చితాభస్మం కూడా అందిం చలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కేశవరావు కర్మకాండలు ఆదివారం నిర్వహించనున్నట్లు ఢిల్లీశ్వరరావు తెలిపారు.

నేత్రపర్వంగా ఎండల మల్లన్న కల్యాణం


టెక్కలి: కల్యాణంలో పాల్గొన్న భక్తులు

టెక్కలి, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రమైన రావివలస భ్రమరాంబిక సమేత ఎండల మల్లికార్జున స్వామి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ముందుగా తిరువీధి నిర్వహించి స్వామికి అభిషేకాలు చేశారు. అర్చకుల వేదమంత్రాలు, మేళతాళాల నడుమ కల్యాణాన్ని చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈవో జి.గురునాధరావు, ఎల్ఎల్ నాయుడు, బడే జగదీష్, నర్తు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి విశేష పూజలు

నందిగాం, మే 31(ఆంధ్రజ్యోతి): నందిగాంలో నూతనంగా నిర్మించిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మందిర ప్రారంభం, చిత్రపట ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం జరిగింది. వీరబ్రహ్మేంద్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ పురోహితుడు తమిరె కరుణశ్రీ ఆచారి పర్యవేక్షణలో గ్రామంలోని దంపతులు విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా జడ్డమ్మతల్లి పండుగలు

పాతపట్నం, మే 31(ఆంధ్రజ్యోతి): చిన్నలోగిడి గ్రామంలో జడ్డమ్మతల్లి గ్రామదేవత పండు గలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ముర్రాటలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి చల్లదనం చేశారు. 3వ తేదీ వరకు నిర్వహించనున్న పండుగల నేపథ్యంలో ఆలయంతో పాటు వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతి ఇల్లు బంధువులతో కళకళలాడుతోంది.


నందిగాం: పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పాతపట్నం: చిన్నలోగిడిలో గ్రామదేవత సంబరాల్లో పాల్గొన్న భక్తులు

ఆక్రమిత ప్రదేశంలో హెచ్చరిక బోర్డు

పలాస, మే 31(ఆంధ్రజ్యోతి): కేటీ రోడ్డు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడంతో తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు శనివారం సంబంధిత నిర్మాణం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పోరంబోకు స్థలంలో నిర్మాణాలు చేస్తున్నారని, దీనిపై నుంచి విద్యుత్ వైర్లు కూడా వెళ్తున్నాయని, దీనివల్ల ఎవరికైనా హాని జరిగితే సంబంధిత యజమాని, మేస్త్రీలపై చర్యలు తీసుకుంటామన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఆమదాలవలస, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒకటో వార్డు పార్వతీశునిపేట జంక్షన్ సమీపంలో శనివారం త్రుటిలో ప్రమాదం తప్పింది. సీఎస్పీ రోడ్డు నుంచి ఏబీ రోడ్డు వరకు ఉన్న మార్గంలో కాలువ తవ్వి నిర్మాణం చేపట్టకుండా ఉంది. ఉదయం 9 గంటల సమయంలో ఏబీ రోడ్డు నుంచి వ్యాన్ సీఎస్పీ రహదారికి వెళుతున్న సమయంలో అదుపు తప్పి కాలువలో దిగిపోయింది. అయితే ఆ సమయంలో వ్యాన్‌లో ప్రయాణికులు, వస్తువులు లేకపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు.

కారు బోల్తా: పలువురికి గాయాలు

టెక్కలి, మే 31(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలం శ్రీపురం వద్ద జాతీయరహదారి పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఒడిశాకు చెందిన కారు శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తూ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఐదుగురు గాయపడగా, మరో ఐదుగురు క్షేమంగా బయటపడ్డారు. క్షతగాత్రులను టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కోటబొమ్మాళి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా కళాజాత

హరిపురం, మే 31(ఆంధ్రజ్యోతి): మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధి ఉద్దానం ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్టును వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం రాంపురం, గంగువాడ గ్రామాల్లో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు కొమర వాసు, కొర్రాయి నీలకంఠం, కోనార సూధన్ మాట్లాడుతూ.. ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేసి ఎయిర్‌పోర్టు నిర్మాణం వద్దని, ప్రజా ఆమోదం తీసుకొని చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు డి.గోవిందరావు, తాండ్ర ప్రకాష్, వంకల మాధవరావు, కొర్ల హేమారావు, నల్ల హడ్డీ, ఎం.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి రూ.1.50 లక్షల సాయం


క్షతగాత్రుడికి నగదు అందిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పూడిజగన్నాథపురం గ్రామానికి చెందిన దుమ్ము ఏకాంబరం ఇటీవల రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతని కుడికాలు తెగి పోయింది. విషయం తెలుసుకున్న హ్యాండ్స్ టుగెదర్ ట్రస్టు ప్రతినిధులు శనివారం రూ.1.50 లక్షల నగదును వైద్య ఖర్చుల నిమిత్తం అందించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు ఆదినారాయణ, కోదండరావు, గణపతి, సింహాచలం, వెంకటరమణ, భాస్కర్ పాల్గొన్నారు.

థియేటర్లలో తనిఖీలు

కాశీబుగ్గ, మే 31 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలోని సినిమా థియే టర్లలో జేసీ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు రెండు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. థియేటర్ల అనుమతులు, సౌకర్యాలను పరిశీలించారు. నిబంధనల మేరకు సినిమ ప్రదర్శిస్తున్నారా, టికెట్ రేట్లు ప్రేక్షకులకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలించారు. ఇందులో భాగంగా భాస్కరరామా థియేటర్‌ను తనిఖీ చేశారు. అయితే లైసె న్స్ రెన్యూవల్ చేయక పోవడంతో సినిమా ప్రదర్శన నిలిపివేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తిని వివరణ కోరగా జంట పట్టణాల్లోని సినిమా థియేటర్లను తనిఖీ చేశామని, అయితే భాస్కర రామా థియేటర్‌కు తనిఖీ సమయంలో సిబ్బంది లైసెన్సు చూపించలేదని, మరోవ్యక్తి వద్ద లైసెన్స్ ఉందని, రెండు రోజుల్లో చూపిస్తామని తెలిపారన్నారు. ఈ విషయమై జాయింట్ కలెక్టర్‌కు నివేదించినట్లు తెలిపారు.

హైవే నెత్తురోడుతోంది

(5వ పేజీ తరువాయి)

నరసన్నపేట వరకూ మాత్రమే ఆరు లైన్లగా విస్తరించారు. దాదాపు 30 వంతెనల వద్ద, గ్రామాలకు వెళ్లే సర్వీసు రోడ్ల వద్ద దాదాపు 900 విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేశారు. వాటికి ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఇవి బాగానే వెలిగాయి. తరువాత నిర్వహణ బాగా లేకపోవడంతో వెలగడం మానేశాయి. రణస్థలంలో అయితే రోడ్డు మధ్యలో వేసిన విద్యుత్ స్తంభం పక్కను ఒరిగిపోయింది. ఎప్పుడు రోడ్డుపై పడుతుందో తెలియని పరిస్థితి. బుడుమూరు, సుభద్రాపురం, తాళ్లవలస, ఎచ్చెర్ల, శ్రీకాకుళం సింహద్వారం, పెద్దపాడు, సింగుపురం, మడపాం వద్ద పూర్తిస్థాయిలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. చాలాచోట్ల ఈ దీపాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్యూజు బాక్సులు సైతం అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇప్పటికైనా జాతీయ రహదారి విభాగం అధికారులు స్పందించి వంతెనలు, సర్వీసు రోడ్ల వద్ద సూచికబోర్డులు, విద్యుత్ దీపాలు వేయాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక దృష్టి సారించాం

జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. పెట్రోలింగ్ పెంచుతున్నాం. స్వీయ రక్షణ, భద్రతతోనే ప్రమాదాలు నియంత్రించగలుగుతాం. ఈ విషయంలో ప్రజల సహకారం కూడా ఉండాలి. అప్పుడే ప్రమాదాలు నియంత్రణలోకి వస్తాయి. పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదు. మద్యం తాగి వాహనాలు నడుపరాదు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

-ఎం.అవతారం, సీఐ, జేఆర్‌పురం సర్కిల్

న్యూస్ బాక్స్

సాగుహక్కు పత్రాలు పొందండి

జలుమూరు, మే 31(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు సాగు హక్కు పత్రాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.సురేష్ తెలిపారు. మర్రివలస, శ్రీముఖలింగం, నగిరికటకం రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాగు హక్కు పత్రాలు పొందిన రైతులు ఈ-పంట నమోదు, ధాన్యం మద్దతు ధర, పంటల బీమా, బ్యాంకు రుణాలు పొందేందుకు అర్హులవుతారన్నారు. సమావేశంలో సర్పంచ్ బగ్గు గోవిందరావు పాల్గొన్నారు.

నేడు పాలపోలమ్మ తల్లిజాతర

వజ్రపుకొత్తూరు, మే 31(ఆంధ్రజ్యోతి): రాజాం పంచాయతీలోని పాలపోలమ్మతల్లి జాతర ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏటా జూన్ మొదటి ఆదివారం ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేడుకలను వచ్చే భక్తులకు ఎటు వంటి ఆటంకం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

పాఠశాలలకు కిట్లు పంపిణీ

నందిగాం, మే 31(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించేందుకు గాను ప్రభుత్వం మంజూరు చేసిన విద్యాకిట్లను పాఠశాలల వారీగా పంపిణీ కార్యక్రమం శనివారం చేపట్టారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో వచ్చిన కిట్లను నందిగాం ఉన్నత పాఠశాల కేంద్రంలో ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు పర్యవేక్షణలో పంపిణీ చేపట్టారు.

నీటి సమస్య పరిష్కారం

పాతపట్నం, మే 31(ఆంధ్రజ్యోతి): పాతపట్నం బాలాజీనగర్-1, 2, 3 వీధుల్లోని తాగు నీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం పంచాయతీ నిధులతో బోరును తవ్వించారు. ఇదే సమస్యపై గతంలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. బోరు ఏర్పాటును ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ భాస్కర్, ఈవో కిశోర్, ఎంపీటీసీలు కె.ఎరకయ్య, పోలాకి రేణుక, సర్పంచ్ ప్రతినిధి ఎస్.జోగారావు పర్యవేక్షించారు.

పింఛన్లతో భరోసా

కొత్తూరు, మే 31(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లతో భరోసా కలుగుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి కోరారు. శనివారం మాతల గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

● హిరమండలం, మే31(ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడి కళ్లల్లో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. శనివారం సుభలయ, నౌగూడ గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.గోవిందరావు ఉన్నారు.

8 మంది హెచ్ఎంల నియామకం

మందస, మే 31(ఆంధ్రజ్యోతి): మందస మండల పరిధిలో 8 జడ్పీ ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు బదిలీపై వచ్చారని ఎంఈవో ఎం.లక్ష్మణరావు తెలిపారు. జీఆర్ పురానికి కె.రమణమూర్తి, హరిపురానికి బి.గోపిచంద్, బహడాపల్లికి జోల కేశవరావు, కొత్తపల్లికి కె.వేణు గోపాలరావు, బైరిసారంగపురానికి దుర్గాప్రసాద్, మందసకు ఎం.శ్రీనివాసరావు, బేతాళపురం బి.సత్యజిత్‌రావు, కృష్ణాపురానికి పి.మన్మథరావు బదిలీ కాగా వారు బాధ్యతలు చేపట్టినట్లు ఎంఈవో తెలిపారు.

సారా తరలిస్తున్న ఆరుగురి అరెస్ట్

హరిపురం, మే 31(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో వివిధ గ్రామాల్లో సారా తరలిస్తు పట్టుబడిన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ బేబీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మందస మండలంలో ఇటీవల చేసిన దాడుల్లో వివిధ గ్రామాల్లో పలువురిని అరెస్ట్ చేశామని చెప్పారు. సారా రవాణా, తయారీపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధికంగా మద్యం తాగి వ్యక్తి మృతి

టెక్కలి, మే 31(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలం సాలిపేట గ్రామానికి చెందిన చలపాకల తారకేశ్వరరావు (40) శనివారం మద్యం ఎక్కువగా తాగి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సీఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీసి ఆ కుటుంబానికి మృతదేహాన్ని అప్పగించారు.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

టెక్కలి, మే 31(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాల్లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలపాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఇంటిలోని ఓట్లన్నీ ఒకచోట ఉండాలని, కొత్త ఓటర్లు నమోదు, పోలింగ్ కేంద్రాల మౌలిక సదుపాయాలు, ఇబ్బందులు గుర్తించి తెలియజేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు బగాది శేషగిరిరావు, బోయిన రమేష్, జనసేన నుంచి మెట్ట అవినాష్, సలాన షణ్ముఖరావు, కాంగ్రెస్ నుంచి టీబీజీ గుప్త, వైసీపీ నుంచి హెచ్.వెంకటేశ్వరరావు, బీజేపీ నుంచి రామ్‌జీ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.